క్లుప్తంగా

లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులు పరిష్కారం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి కమలాదేవి

కాకినాడ లీగల్: వచ్చే నెల 14న జరుగునున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఇరు పార్టీల అంగీకారంతో క్రిమినల్ ఎక్కువ కేసులు పరిష్కరించాలని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి , మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ పి.కమలాదేవి అన్నారు. శనివారం కోర్టు హాల్లో పోలీసు అధికారులు, కోర్టు కానిస్టేబుల్‌తో సమావేశం నిర్వహించారు. జిల్లా జడ్జి కమలాదేవి మాట్లాడుతూ క్రిమినల్ కేసుల్లో ఉన్న ఇరు పార్టీలకు పంతాలు, పట్టింపులకు పోకుండా వారికి చట్టాలపై అవగాహన కల్పించి, కేసు రాజీ వల్ల ప్రయోజనాలను వివరించాలని సూచించారు. కేసులు గుర్తించి అధిక సంఖ్యలో పరిష్కరించాలన్నారు. సమావేశంలో న్యాయమూర్తులు, పోలీసు అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

గోశాలకు ఎండు గడ్డి

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామాల్లోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయం గోశాలలో రెండు ట్రాక్టర్లు ఎండు గడ్డిని వేయించినట్టు ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. గోవులకు మేత, గ్రాసం కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలియజేశారు.

ఉద్యోగులకు సత్కారం



యూనియన్ నాయకులను సత్కరిస్తున్న దృశ్యం

కాకినాడ: స్థానిక ఆర్టీసీ డిపోలో పనిచేస్తూ పదవీ విరమణ చేసిన నలుగురు ఉద్యోగులను శనివారం ఘనంగా సత్కరించారు. వివిధ హోదాల్లో సమర్థవంతమైన సేవలు అందించిన వారికి అభినందిస్తున్నామని డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ అభినందించారు. ఉద్యోగుల సేవలను కొనియాడారు. పదవీ విరమణ చేసిన వీఎస్ అప్పుడు, పి.రామచంద్రరావు, వై.అప్పారావు, పలకా రామకృష్ణ సత్కారం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, అసిస్టెంట్ ఇంజినీర్ కె.ప్రభాకర రావు, పీఆర్వో సీహెచ్ వెంకటరాజు, సూపరింటెండెంట్ డి.త్రిమూర్తులు, యూనియన్ నాయకులు, సిబ్బంది ఉన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి



సబ్‌జైల్‌ను పరిశీలిస్తున్న మెజిస్ట్రేట్ ప్రసన్నలక్ష్మి

కాకినాడ లీగల్: ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, అనవసర గొడవలకు వెళ్లడం వల్ల సమాజంలో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని కాకినాడ రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.ప్రసన్నలక్ష్మి తెలిపారు. శనివారం స్థానిక స్పెషల్ సబ్‌జైలులో పరిశీలించారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ ఎవరికైనా న్యాయవాదులను పెట్టుకునే స్తోమత లేకపోయినా తమ మండల న్యాయసేవాధికార సంస్థకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నిందితులను సమస్యలు, వసతులు, భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సబ్ జైలు డిప్యూటీ జైలర్ జోసఫ్ పాల్గొన్నారు.

మోసం చేసిన కేసులో వ్యక్తి అరెస్టు

కాకినాడ రూరల్: పెద శంకర్లపూడికి చెందిన మహిళను మోసం చేసిన కేసులో వాకలపూడి గ్రామానికి చెందిన పాత్రికేయుడు పి.రాజ్ కుమార్‌ను అరెస్టు చేశామని, మేజిస్ట్రేట్ 14రోజుల పాటు రిమాండ్ విధించినట్టు సీఐ బి.పెద్దిరాజు తెలిపారు. ఇందుకు సంబంధించి సీఐ వివరాలు ఇలా ఉన్నాయి. బాధిత మహిళకు ఇద్దరు అబ్బాయిలు, ఒక అమ్మాయి. 8ఏళ్ల క్రితం భర్త విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. స్వగ్రామంలో వ్యవసాయ కూలీగా పని చేసుకుంటోంది. నాలుగేళ్ళ క్రితం ఆమె ఆరెళ్ల కుమార్తెపై ఒక వ్యక్తి అత్యాచార యత్నానికి పాల్పడడంతో ప్రత్తిపాడు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. ఆ సమయంలో దూరపు బంధువు ద్వారా బాధిత మహిళలకు రాజ్ కుమార్ పరిచయం ఏర్పడడంతో కుమార్తె కేసులో సొమ్ములు ఇప్పిస్తానని నమ్మించాడు. సొమ్ములు అవతలి వారి నుంచి తీసుకుని బాధితురాలికి ఇవ్వకుండా కోర్టు కేసు కొట్టివేసిన తరువాత ఇస్తానని నమ్మించాడు. పని కల్పిస్తానని కాకినాడ తీసుకువచ్చి వాకలపూడిలో మకాం పెట్టి ఆమెతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. అక్కడ నుంచి గుడారిగుంట మకాం మార్చాడు. అక్కడ ఇంటి అద్దె కూడా చెల్లించకపోవడం డబ్బులు ఇస్తానని నమ్మించి, ప్రలోభ పెట్టి మోసం చేసినందున బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడి

కరప: గ్రామంలోని బెల్ట్‌షాపుపై తాళ్లరేవు ఎక్సైజ్ శాఖ అధికారులు దాడి చేసి, ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు నుంచి 17 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు సీఐ కోటేశ్వరరావు తెలిపారు.

పొడిగింపు సరే.. నిధులేవీ?

- నత్తనడకన స్మార్ట్‌సిటీ పనులు
- గడువు దగ్గర పడుతున్నా విడుదల కాని నిధులు
- మార్చితో ముగియనున్న స్మార్ట్‌సిటీ కాలపరిమితి



కాకినాడ నగరం



స్మార్ట్‌సిటీ లోగో

కాకినాడ: స్మార్ట్‌సిటీ పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారాయి. ఆకర్షణీయ నగర ప్రాజెక్టు కాలపరిమితిని మరో తొమ్మిది నెలలు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు విడుదల కాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే అన్న చందంగా మారాయి. దేశంలోని 100 నగరాలను స్మార్ట్‌సిటీలుగా ఎంపిక చేస్తూ 2017లో కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందులో ఆంధ్రప్రదేశ్ నుంచి అమరావతి, తిరుపతి కూడా ఎంపికయ్యాయి. 2017–2022 మధ్య ఐదేళ్ల పరిధిలో రూ.978 కోట్ల ఖర్చు గల వివిధ ప్రాజెక్టులకు అప్పట్లోనే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్రాజెక్టు పనులు పూర్తి కావాలన్నది పథకం ముఖ్యోద్దేశం. 2022 నాటికి ప్రాజెక్టు కాలపరిమితి పూర్తయినప్పటికీ పూర్తిస్థాయిలో నిధులు విడుదల కాకపోవడంతో అనేక పనులు ఎక్కడికక్కడ మధ్యలోనే నిలిచిపోయాయి.

మార్చి వరకు కాలపరిమితి..

ఈ నేపథ్యంలో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టును 2025 మార్చి 31 వరకు పొడిగిస్తూ కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఐదు నెలల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. మరో నాలుగు నెలల్లో ప్రాజెక్టు కాలపరిమితి పూర్తికానుండగా బకాయి నిధులను ఇప్పటి వరకు విడుదల చేయలేదు. అధికారుల లెక్కల ప్రకారం స్మార్ట్‌సిటీ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్రం నుంచి రూ.8 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.186 కోట్లు విడుదల కావాల్సి ఉంది. ఈ మొత్తం నిధులు విడుదలైతేనే 2025 మార్చి నాటికి పెండింగ్ పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. మొక్కుబడిగా ప్రాజెక్టు కాలపరిమితిని పెంచిన కేంద్ర ప్రభుత్వం ఆ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటి వరకు పైసా విదల్చకపోవడంతో స్మార్ట్‌సిటీ పనులు సకాలంలో పూర్తయ్యే పరిస్థితి కనిపించడంలేదు.

పెండింగ్ పనులు ఇవే...

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావలసిన రూ.196 కోట్లు విడుదలైతే వివిధ దశల్లో ఉన్న సైన్స్ సెంటర్, నగరపాలకసంస్థ అధునాతన భవనం, నాడు–నేడు పథకంలో చేపట్టిన పాఠశాలల అభివృద్ధి పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. నిధులు విడుదల కాని నేపథ్యంలో ఈ పనులు పూర్తికావడం సందేహాస్పదంగానే ఉంది. దీనిపై స్మార్ట్‌సిటీ ఎస్‌ఈ మత్స్యరాజును వివరణ కోరగా నిధులు విడుదల కావలసి ఉందని, వచ్చిన వెంటనే పనులు వేగవంతం చేసి 2025 మార్చి నాటికల్లా పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అయ్యప్పస్వామికి పూజలు

బోట్‌క్లబ్: స్థానిక పేర్రాజుపేటలోని ఎన్‌వీ సాయిబాబా గురుస్వామి పీఠంలో శనివారం అయ్యప్పస్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం అష్టోతర పూజ చేశారు. ఈశ్వర్, భద్రరావు, సతీష్ పాల్గొన్నారు.

దూరప్రాంత ప్రయాణికులకు రాయితీ

కాకినాడ: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే హైదరాబాద్, కర్నూలు, తిరుపతి ఏసీ బస్సులకు టిక్కెట్ ధరలో 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్టు డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ తెలిపారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకూ ఈ రాయితీ వర్తిస్తుందన్నారు. నైట్ రైడర్, వెన్నెల, హైదరాబాద్–అమరావతి, కర్నూలు, ఇంద్ర, తిరుపతి– ఇంద్ర బస్సులకు ఈ రాయితీ వర్తిస్తుందన్నారు.

వైభవంగా జపయజ్ఞ పారాయణ

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలోని గణపతి పీఠంలో శనివారం ఉదయం శ్రీవారి 61 వ జపయజ్ఞ పారాయణ జరిగింది. కొబ్బరి కాయల రాశి నడుమ అప్పనపల్లి బాల బాలాజీ విగ్రహాన్ని ప్రతిష్ఠించి సహస్ర గోవిందనామ స్తోత్ర పఠనం నిర్వహించారు. రాజ్యాంగ గ్రంథాన్ని సప్తగిరుల పూజలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. పీఠం వ్యవస్థాపక ఉపాసకులు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ భారత రాజ్యాంగ వజ్రోత్సవాల సందర్భంగా ప్రజాస్వామ్య దేవాలయంలో కొలువై ఉన్న రాజ్యాంగ అంశాలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. పంచా మృతాలతో విఘ్నేశ్వర స్వామి, వేంకటేశ్వరస్వామి వార్లకు అభిషేకాలు చేసి శ్రీవారి ఆరాధకులకు తాంబూలాలు పంపిణీ చేశారు.

96 శాతం పింఛన్లు పంపిణీ



నడకుదురులో పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు

కాకినాడ: కాకినాడ సిటీలో 96.1 శాతం పింఛన్లను పంపిణీ చేసినట్టు నగరపాలక సంస్థ కమిషనర్ భావన తెలిపారు. ఈ నెల ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగా ఈ పింఛన్లు పంపిణీ చేశామన్నారు. 29,874 పింఛన్లకు గాను 28,683 మందికి రూ.12.20 కోట్ల సొమ్మును పంపిణీ చేసినట్టు కమిషనర్ తెలిపారు.

కరప: ప్రభుత్వం అందించే పింఛన్లు శనివారం సాయంత్రానికి కరప మండల పరిధిలో 93.26 శాతం పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ ఎం.అనుపమ తెలిపారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో పింఛనుదారులు 11,386 మంది ఉండగా రూ.4,77,08,000 లు ఇవ్వాల్సి ఉందన్నారు. వీరిలో 10,600 మంది లబ్ధిదారులకు రూ.4.44.31,500 గ్రామ సచివాలయం సిబ్బంది, వీఆర్వోలు తదితర ప్రభుత్వోద్యోగులు లబ్ధిదారులు ఇంటికెళ్లి పింఛన్లు అందించారన్నారు. గొర్రిపూడి–1 గ్రామ సచివాలయం 96.64 శాతం , గొర్రిపూడి–2 సచివాలయం 96.46 శాతం, ఉప్పలంక సచివాలయం 96.32 శాతంతో వరసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉన్నాయన్నారు. ఈఓపీఆర్డీ ఎస్.శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శుల పర్యవేక్షణలో లబ్ధిదారుల ఇంటికెళ్లి పింఛన్ల సొమ్ములు అందజేశారన్నారు. గతనెల తీసుకోనివారికి కూడా రెండు నెలల పింఛను సొమ్ము అందజేసినట్టు ఎంపీడీఓ తెలిపారు. మిగిలిపోయిన లబ్ధిదారులకు సోమవారం అందజేస్తామని ఎంపీడీఓ అనుప వివరించారు.

మహాకుంభాభిషేకానికి ఏర్పాట్లు పూర్తి

- నేడు సాగర తీరంలో మహోత్సవం
- ఒక కోటి ఎనిమిది లక్షల శివలింగాలకు అభిషేకం



మహాకుంభాభిషేకం కోసం సిద్ధంగా చేసిన ఒక కోటి ఎనిమిది లక్షల శివలింగాలు

కాకినాడ రూరల్: లోక కల్యాణార్థం ప్రకృతి ప్రమాదాల నుంచి దేశానికి ఉపశమనం కలిగించే శివ కేశవులకు మహాయజ్ఞంగా కాకినాడ సాగర తీరన శివ భక్తుని సంకల్పంతో కళాబంధు డాక్టరు టి.సుబ్బిరామిరెడ్డి నిర్మించిన శ్రీమంగళాంబిక సమేత ఆదికుంభేశ్వరస్వామి ఆలయం మహాకుంభాభిషేకానికి ముస్తాబయ్యింది. ఒక కోటి ఎనిమిది లక్షల శివ లింగాలకు 49వ మహా కుంభాభిషేకం ఆదివారం అత్యంత వైభవంగా జరగనుంది. ఇందు కోసం ఆలయంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. సాగర తీరాన్ని కొలువైన ఆదికుంభేశ్వరస్వామి దర్శించుకునేందుకు కాకినాడ, పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్నారు. ఆలయ ప్రాంగణంలో రసలింగేశ్వరునికి, ఆలయం వద్ద ఒక కోటి ఎనిమిది లక్షల శివలింగాలకు మహాకుంభాభిషేకం పవిత్ర జలాల్లో నిర్వహించనున్నారు.

పూజా కార్యక్రమాలు ఇలా...

ఉదయం 9గంటలకు గోపూజ, 8.38 గంటలకు విఘ్నేశ్వరపూజ, పంచకాటకం, వేద పఠనం, రసలింగేశ్వరునికి విభూదితో అభిషేకం, అనంతరం అభిషేక విభూది సముద్రంలో నిమజ్జనం నిర్వహించనున్నారు. ఉదయం 9.38 గంటలకు కోటి ఎనిమిది శివలింగాలకు మహా కుంభాభిషేకం, 9.40 గంటలకు పాద రసలింగానికి మహాకుంభాభిషేకం, 9.45 గంటలకు ద్వాదశ లింగాలకు బిల్వార్చన(మారేడు దళాలతో), 9.50 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దర్శనం, 10.38 గంటలకు శ్రీ ఆదికుంభేశ్వరస్వామి బిల్వార్చన, 12 గంటలకు స్వామి వారికి ఏకాంత సేవ, భక్తులకు అన్న సంతర్పణ, ఒంటి గంటకు శ్రీ లలితా దేవికి సహస్ర నామాలతో కుంకుమార్చన, 2 గంటలకు శ్రీమంగళాబింక సమేత శ్రీఆదికుంభేశ్వరస్వామి వారి కళ్యాణం, హోమం, పూర్ణాహుతి, సాయంత్రం 4గంటలకు అభిషేక ద్రవ్యాలు 108మంది కన్యలతో సాగరంలో నిమజ్జనం, అనంతరం ఆధ్యాత్మిక సభ నిర్వహించన్నారు. ఇందు కోసం భారత యజ్ఞపీఠం కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

పన్నుల వసూళ్లపై దృష్టి



పన్నుల వసూళ్లపై సమీక్షిస్తున్న కమిషనర్ భావన

కాకినాడ: నగరపాలక సంస్థకు పన్నులు, ఇతర మార్గాల ద్వారా వచ్చే ఆదాయంపై దృష్టి సారించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఇతరులను ఆదేశించారు. శనివారం ఆమె రెవెన్యూ విభాగానికి చెందిన అధికారులు సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పన్ను, కుళాయి పన్ను ఖాళీ స్థలాల పన్ను, మున్సిపల్ కాంప్లెక్స్‌లు ద్వారా వచ్చే ఆదాయాలను వసూళ్ల చేసే దిశగా దృష్టిపెట్టాలన్నారు. ముఖ్యంగా మొండి బకాయిదారులకు నోటీసులు ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా ఆరు వేల మంది ఇంటి పన్ను బకాయిలు, 7 వేల మంది నీటి పన్నుల బకాయిలకు నోటీసులు ఇవ్వాలని సూచించారు. ఇకపై పన్నుల వసూళ్ళను ప్రతి వారం సమీక్షిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కమిషనర్ కె.టి.సుధాకర్, డిప్యూటీ కమిషనర్ మనోహర్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

అపార్ ఐడీ వేగవంతం చేయండి

కాకినాడ: అపార్ ఐడీ నమోదు లక్ష్యాన్ని నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె నోడల్ ఆఫీసర్లతో ఈ అంశంపై సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ అపార్‌ఐడీ నమోదుపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు. జనన ధృవీకరణ పత్రాలు, ఆధార్‌లో మార్పులు ఉంటే సరిచేయాలన్నారు. అపార్ ఐడి నెంబర్ వేగవంతగా పూర్తయ్యేలా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను అప్రమత్తం చేయాలన్నారు. ప్రతి విద్యార్థి అపార్ ఐడీ వివరాలను యూ డైస్ ప్లస్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ కె.సుధాకర్, డిప్యూటీ కమిషనర్ మనోహర్, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, టీపీఆర్వో శైలజ తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌లో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ షణ్మోహన్
- అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: కాకినాడ సముద్రతీరంలో ఉన్న బీచ్ ప్రాంతంలో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసి సందర్శకులకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్, కాకినాడ మున్సిపల్ కమిషనర్ భావన, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాతో కలిసి రెవెన్యూ, పర్యాటకం, జిల్లా పరిషత్, పంచాయతీ, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కొడా), శిల్పారామం, ఆర్టీసీ తదితర శాఖల అధికారులతో కాకినాడ సముద్ర తీర ప్రాంతం అభివృద్ధి, కార్యకలాపాల ప్రారంభం, నూతన ప్రాజెక్టు అంశాలపై చర్చించారు. తిరిగి సముద్ర తీరంలో సాగర సంబరాలు నిర్వహణకు చేపట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలు, కొడా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎయిర్ క్రాఫ్ట్ ప్రారంభం, బీచ్ ఫ్రెంట్, రెస్టారెంట్, లైటింగ్, ఎగ్జిబిషన్స్ బీచ్ క్లీనింగ్, గ్లాస్ బ్రిడ్జి వంటి విషయాలను కలెక్టర్ షణ్మోహన్ అధికారులతో సమీక్షించారు. వాకలపూడి వద్ద ఉన్న బీచ్ పార్కు, కొడా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎయిర్ క్రాఫ్ట్‌ను రానున్న ఈనెల 20 నాటికి సందర్శకులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఇందుకు పర్యాటకం, మున్సిపల్ కార్పొరేషన్ జిల్లా పరిషత్, పంచాయతీ, శిల్పారామం ఇతర శాఖల అధికారులు ప్రణాళిక ప్రకారం పని చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. శిల్పారామాన్ని ఆకర్షణగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు, కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు, పంచాయతీ అధికారి వి.రవికుమార్, జిల్లా పర్యాటకశాఖ అధికారి పి.పోశయ్య, ఏపీటీడీసీ మేనేజర్ సీహెచ్ పవన్‌కుమార్, డీఈజీ సత్యనారాయణ, సీపీవో వి.త్రిమూర్తులు, శిల్పారామం ప్రతినిధి సి.మోహన్ తేజ, కొడా ఆర్టీసీ అధికారాలు పాల్గొన్నారు.

సేవలతోనే సంతృప్తి



మోహన్‌రెడ్డి దంపతులను సత్కరిస్తున్న వీసీ ప్రసాదరాజు, రిజిస్ట్రార్ రవీంద్రనాథ్

బాలాజీచెరువు: ఉద్యోగ జీవితంలో చేసిన సేవలే సంతృప్తినిస్తాయని జేఎన్‌టీయూకే ఇన్‌చార్జివీసీ డాక్టర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. జేఎన్‌టీయూకే మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో వర్క్‌షాప్ ఆర్టిజన్‌గా విధులు నిర్వహిస్తున్న జి.మోహన్‌రెడ్డి స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన నేపథ్యంలో సత్కార సభ నిర్వహించారు.ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధిలో తన వంతు సేవలు అందిచారన్నారు. ఆర్టిజన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ 1991లో జేఎన్‌టీయూకేలో ఉద్యోగిగా చేరి సేవలు అందించానని, తనకు సహకరించిన టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. మాజీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ప్రిన్సిపాల్ మోహనరావు, నాన్‌టీచింగ్ అసోషియేషన్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాసరావు, కార్యదర్శి సత్తిబాబు, ఎస్సీ, ఎస్టీ లైజాన్ ఆఫీసర్ కుమారస్వామి, లింగరాజు పాల్గొన్నారు.

నడకుదురులో డెంగీ కేసు

కరప: నడకదురు గ్రామంలో డెంగీ కేసు నమోదు కావడంతో ప్రజలు బేజార్ చెందుతున్నారు. గ్రామ పంచాయతీ, వైద్య సిబ్బంది అప్రమత్తమై పారిశుధ్యం పనులు చేపట్టి, దోమలనివారణ మందులు పిచికారీ చేయించారు. ముందుజాగ్రత్త చర్యలో భాగంగా గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. నడకుదురులోని ఎస్సీ వీధికి చెందిన మాసా అర్జునరావు పంచాయతీ మంచినీటి పైపులైన్ పనులు చేస్తుంటాడు. ఈనెల 27వ తేదీన తీవ్రంగా జ్వరం, విపరీతమైన తలపోటు రావడంతో చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి వెళ్లాడు. అతనిని ఒక రోజు పరిశీలనలో ఉంచి, 29న టెస్టు చేయగా డెంగీ పాజిటివ్ నిర్ధారణ అయింది. కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామసర్పంచ్ దేగల లలితకుమారి స్పందించి పంచాయతీ, వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశారు. మండల ఈఓపీఆర్డీ ఎన్వీ శ్రీనివాసరావు పారిశుధ్య పనులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామకార్యదర్శి కె.వారిజ, మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాసనాయక్ తమ సిబ్బందితో కల్సి ఇంటింటా ఫీవర్ సర్వే చేపట్టారు. వీధులను శుభ్రంచేయించి, బ్లీచింగ్ చల్లించారు. దోమల నివారణకు డ్రైన్లలో ఎబేట్ మందును స్ప్రే చేయించారు. డెంగ్యూ జ్వరబాధితుని ఇంటిలోను, పరిసర ప్రాంతాల్లోను ఫైరిత్రాన్ మందును స్ప్రే చేయించారు. వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ముందు జాగ్రత్తగా గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.

కలెక్టర్‌ను కలిసిన నూతన నర్సింగ్ కమిటీ



కలెక్టర్‌ను కలిసిన నూతన నర్సింగ్ కమిటీ

కాకినాడ క్రైం: నూతనంగా ఎన్నికైన తూర్పుగోదావరి జిల్లా నర్సింగ్ అసోసియేషన్ నాయకత్వం శనివారం కలెక్టర్ షన్మోహన్‌ను శనివారం కాకినాడ కలెక్టరేట్‌లో కలిసింది. ఎన్నికల్లో విజయం సాధించిన నాయకులు, ప్యానల్ సభ్యులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. నర్సుల అభ్యున్నతి కోసం పాటు పడి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘ అధ్యక్షురాలు బూరిగ విజలక్ష్మి, సెక్రటరీ ప్రమోద, వైస్ ప్రెసిడెంట్ రాణి, ట్రెజరర్ పరమేశ్వరితోపాటు ఏపీఎన్‌జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహన్, కార్యదర్శి వెంకట కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు మూర్తిబాబు ఉన్నారు. అనంతరం ఈ బృందం ఏపీ ఎన్‌జీఓ నాయకులతో కలిసి డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ నరసింహనాయక్‌ను ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

సంగీత విద్వాంసుడు మల్లికార్జునకు సత్కారం



ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారాన్ని పొందిన మల్లికార్జునను సత్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: సంగీత విద్వాంసులు బి.మల్లికార్జునకు రంగస్థల విభాగంలో 2023వ సంవత్సరానికి జాతీయ స్థాయి పురస్కారం నాటక అకాడమి వారిచే ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారాన్ని పొందారు. కాకినాడ సెట్రాజ్ ద్వారా వచ్చిన ఈ పురస్కారాన్ని శనివారం రాత్రి కలెక్టర్ షణ్మోహన్ సగిలి చేతుల మీదుగా మల్లిఖార్జునకు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను కలెక్టర్ దుశ్శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సెట్రాజ్ ముఖ్య కార్యనిర్వాహాధికారి కేఎస్‌వీ కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

వైఎంసీఏ కోనసీమ సబ్‌రీజియన్ చైర్మన్‌గా జాన్ పెన్మత్స



వైఎంసీఏ కోనసీమ సబ్‌రీజియన్ నూతన కమిటీ

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): యంగ్‌మెన్స్ క్రిస్టియన్ అసోసియేషన్ కోనసీమ సబ్‌రీజియన్ చైర్మన్‌గా జాన్‌పెన్మత్స ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం కాకినాడ సిటీ టేబర్నికల్ చర్చిలో వైఎంసీఏ కాకినాడ జిల్లా అధ్యక్షుడు పీఎం హెన్రీ వైఎంసీఈ కోనసీమ సబ్‌రీజియన్ నూతన కమిటీ ఎన్నికలు నామినేషన్ కమిటీ చైర్మన్ ఎంఏపీ విజయ్‌కుమార్ అధ్వర్యంలో ఏకగ్రీవంగా జరిగాయి. సబ్‌రీజియన్ వైస్‌చైర్మన్లగా కె.దుర్గాప్రసాద్, పి.రామరాజు, కోశాధికారిగా వడ్డి శాంత ఆలీవ్, సాధారణ కన్వీనర్‌గా టి.మార్టిన్ సుధాకర్, వుమెన్ ఎంపవర్‌మెంట్ విభాగానికి కె.సుధా సమత ఎన్నికైనట్టు నేషనల్ బోర్డు మెంబరు డాక్టర్ పి.జాన్ వీకే గాంధీ తెలిపారు. ఈ ఎన్నికల కార్యక్రమంలో నేషనల్ ఫైనాన్స్ కమిటీ మెంబరు కోలమూరి ప్రభాకర్‌రావు, రీజనల్ ట్రెజరర్ సునీల్, శామ్యూల్ విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అరుణ్ గాత్ర కచేరి

బోట్‌క్లబ్: సరస్వతీ గాన సభ 121వ వార్షిక సంగీత, నృత్య, నాటకోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్థానిక సూర్యకళా మందిరంలో చెన్నైకు చెందిన ఓఎస్ అరుణ్ గాత్ర కచేరి ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. అమ్మ ఆనంద దాయిని వర్ణంతో ప్రారంభించి హంసధ్వని రాగంలో ముత్తుస్వామి దీక్షితార్ వారి వాతాపి, సౌరాష్ట్ర రాగంలో రంగనాథుడే వంటి కృతులు గానం చేసి సంగీత ప్రియులను వీనుల విందు చేశారు.

పోలీసుల నిర్లక్ష్యం

బోట్‌క్లబ్: జగ్గంపేట మండలం రాజపూడిలో ఎస్సీలపై అగ్రవర్ణాల దాడి చేసినా వారిపై చర్యలు తీసుకొనకుండా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజయ్ అన్నారు. ఈ మేరకు కలెక్టర్ షణ్మోహన్ సగిలిని శనివారం కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. గత నెలలో దీపావళి రోజున దళితులపై జరిగిన దాడికి నెలరోజులు గడుస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. ఈ విషయంలో జగ్గంపేట ఎస్ఐ, సీఐ బాధితులతో బేరసారాలు సాగించడం బాధాకరమన్నారు. బాధితులకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

3న జిల్లా స్థాయి పర్యావరణ సైన్స్ కాంగ్రెస్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి రమేష్, అధికారులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): నేషనల్ గ్రీన్ కోర్, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీన కాకినాడలో నిర్వహించే జిల్లా స్థాయి పర్యావరణ సైన్స్ కాంగ్రెస్ విజయవంతం చేయాలని డీఈఓ పిల్లి రమేష్ కోరారు. తన ఛాంబర్‌లో శనివారం సాయంత్రం పోస్టర్ అవిష్కరించి మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారు చేయడం, వ్యర్థ పదార్థాల పున:పక్రియ, జీవవైవిధ్యం, మృత్తికారోగ్యం విషయంపై పోస్టర్ ప్రజంటేషన్ నిర్వహిస్తారన్నారు. ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీ నాగేశ్వరరావు, అసిస్టెంట్ కమిషనర్ రాజశేఖర్, ఉమ్మడి పరీక్షల విభాగం కార్యదర్శి వెంకటరావు, నేషనల్ గ్రీన్ కోర్ ప్రాంతీయ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లైబ్రరీ సైన్స్‌కు 0.5 క్రెడిట్స్ కేటాయించాలని వినతి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): క్రీడల, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగాలకు కేటాయించిన విధంగా లైబ్రరీ సైన్స్‌కు 0.5 క్రెడిట్స్ కేటాయించాలని గోదావరి లైబ్రేరీ అసోషయేషన్ ఉమ్మడి జిల్లా సభ్యులు కోరారు. ఈ మేరకూ జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ మురళీకృష్ణకు శుక్రవారం సాయంత్రం వినతిపత్రం అందజేశారు. గోదావరి లైబ్రరీ సైన్స్ అసోషయేషన్ కార్యదర్శి కొక్కెరమెట్ల సాయిబాబా మాట్లాడుతూ క్రెడిట్స్ సౌకర్యం ప్రవేశపెట్టడం ద్వారా గ్రంథాలయాల ఉనికి మరింత పెరగడంతో పాటు రీడింగ్ రీసెర్చ్, ప్రాజెక్టు స్కిల్స్ పెంపొందించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో న్యాయ స్థాన పరిధిలో ఉన్న 31 పోస్టుల భర్తీ చేయాలన్నారు.వినతి పత్రం అందజేసిన వారిలో కోశాధికారి ఆచార్యులు, సభ్యులు తమ్మారావు, రవిశంకర్ ఉన్నారు.